క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత



ప్రభావమ్మకు నగదు అందజేస్తున్న శ్రీలక్ష్మి

ఓజిలి: మండలంలోని కురుగొండ ఎస్సీ కాలనీలో బల్లి ప్రభావతమ్మకు వైఎస్సార్ బీమా పథకంలో మంజూరైన రూ.10 వేల నగదును సర్పంచ్ శ్రీలక్ష్మి గురువారం అందజేశారు. ఇటీవల ప్రభావతమ్మ భర్త హరనాథ్ మృతి చెందారు. ఈ నేపథ్యంలో మంజూరైన వైఎస్సార్ బీమా నగదు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ



దీవీ సత్రంలోని పరీక్ష కేంద్రానికి వెళుతున్న ఇంటర్ విద్యార్థులు

దొరవారిసత్రం: మండల కేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని గురువారం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే జిల్లా కేంద్రం నుంచి విచ్చేసిన సిట్టింగ్ స్క్వాడ్ కూడా ఇక్కడే ఉండి ఇంటర్ పరీక్షల తీరును పరిశీలించింది. మావిళ్లపాడు ఆదర్శపాఠశాల, డీవీ సత్రం కేజీబీవీ, బీసీ గురుకుల పాఠశాలలకు చెందిన ద్వితీయ సంవత్సరం ఇంటర్ విద్యార్థులు 245 మందిగాను 235 మంది పరీక్షలకు హాజరైనట్లు గురుకులం ప్రిన్సిపల్ తిరుపతయ్య తెలిపారు.

బహుజనుల రథయాత్ర



ప్రజలతో మాట్లాడుతున్న రవిరాఘవేంద్ర

రాపూరు: ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యునైట్ ఫోరం ఆధ్వర్యంలో చేపట్టిన బహుజనుల చైతన్య రథయాత్ర గురువారం మండలంలోని రావిగుంటపల్లె, పులిగిలపాడు తదితర గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా ఫోరం జాతీయ అధ్యక్షుడు రవిరాఘవేంద్ర, ఉపాధ్యక్షుడు విజయకుమార్ మాట్లాడుతూ కాన్షీరామ్ జయంతి వేడుకల్లో భాగంగా గ్రామాల్లోని ప్రజలను కలుసుకుని ప్రజల సమస్యలు తెలుసుకోవడమే రథయాత్ర లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరుణమ్మ, ప్రసాద్, కుమారి, కోటి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందున్నాం!



సరుకులు అందజేస్తున్న క్లబ్ అధ్యక్షుడు

గూడూరు: లయన్స్ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాల్లో ముందున్నామని క్లబ్ అధ్యక్షుడు డీ రవీంద్రరెడ్డి పేర్కొన్నారు. స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలు ఆవరణలో గురువారం పేదలకు సీఆర్‌రెడ్డి ఆసరా పథకం ద్వారా ఫల సరుకులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రముఖ వైద్యుడు సీఆర్‌రెడ్డి దాతృత్వంతో నిరాశ్రయులైన వృద్ధులకు నెలనెలా సరుకులు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు వీ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్వీరావు, వెంకట్రామిరెడ్డి, పీ వెంకటేశ్వరరావు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై విచారణ



విచారణ జరుపుతున్న అధికారులు

కోట: మండలంలోని ఊనుగుంటపాళెంలో జరిగిన ఉపాధి పనుల్లో చోటుచేసుకున్న అవకతవకలపై గురువారం అధికారులు విచారణ జరిపారు. ఇక్కడ రూ.9.50 లక్షలతో చెరువు మరమ్మతు పనులు చేపట్టగా కూలీలకు బదులుగా యంత్రాలను వినియోగించి, పనులు చేపట్టినట్లు ఉన్నతాధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీలు ప్రేమ్‌కుమార్, రవికుమార్ చెరువు పనులను పరిశీలించి, స్థానికులను విచారించారు. వారి నుంచి వివరాలు నమోదు చేశారు. మస్టర్ల ఆధారంగా విచారణ జరుపుతామన్నారు. రికార్డులను అధికారులు తమ వెంట తీసుకెళ్లినట్లు ఏపీఓ పూర్ణిమ తెలిపారు. ఎంపీపీ దాసరి అంజమ్మ, ఎంపీడీఓ భవానీ పాల్గొన్నారు.

వైభవంగా గంధోత్సవం



ఓజిలి: మండల కేంద్రంలోని ఖాదర్ అవులియా 34వ గంధమహోత్సవం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. దర్గాలో ముస్లింలు ప్రార్థనలు చేసి, బాణాసంచా పేలుళ్లు, తెనాలి బ్యాండు వాయిద్యాల నడుమ గంధమహోత్సవం ప్రారంభించారు. దర్గా వద్ద కీలుగుర్రాలు ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యుత్ దీపాలతో దర్గాను సుందరంగా అలంకరించారు.

అమరజీవి సేవలు అజరామరం

వెంకటగిరి: శ్రీపొట్టిశ్రీరాములు ఆంధ్రరాష్ట్రానికి చేసిన సేవలు అజరామరం అని ఆర్యవైశ్య సంఘం నేతలు బీ.విజయకుమార్, టీ.కరుణాకర్ కొనియాడారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం కన్యకాపరమేశ్వరి ఆలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు బీ.విజయకుమార్, టీ.కరుణాకర్‌లు మాట్లాడుతూ బాషా ప్రయుక్త రాష్ట్రసాధనకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగం ఎవరూ మరవలేనిదన్నారు. అంతకుముందు పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రరాష్ట్ర సాధన ఘనత పొట్టి శ్రీరాములదే

మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించిన ఘనత అమరజీవి పొట్టి శ్రీరాములకే దక్కుతుందని నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ దొంతు శారద తెలిపారు. తూర్పువీధి గ్రంథాలయంలో పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం చిన్నారులకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ విప్ పూజారి లక్ష్మి, గ్రంథాలయాధికారి ఏ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

వెంకటగిరి రూరల్: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టిశ్రీరాములు చేసిన ప్రాణత్యాగం చిరస్మరణీయమని తొమ్మిదో బెటాలియన్ కమాండెంట్ పి ప్రకాష్ తెలిపారు. మండలంలోని వల్లివేడు సమీపంలో ఉన్న 9వ బెటాలియన్‌లో గురువారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను గురువారం పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. పెళ్లకూరు రెవెన్యూ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయంతోపాటు రావులపాడు, తాళ్వాయిపాడు, పెళ్లకూరు, చెంబేడు, పాలచ్చూరు తదితర ప్రభుత్వ పాఠశాలల్లో పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలు జరుపుకున్నారు.ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగం గురించి వక్తలు కొనియాడారు. భాషలు, రాష్ట్రాల విభజనతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ సురేష్‌బాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సంతోషి, సాయి, వీఆర్వో రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



వెంకటగిరి రూరల్: మాట్లాడుతున్న బెటాలియన్ కమాండెంట్ ప్రకాష్

సైదాపురంలో..

సైదాపురం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన సేవలు ఎన్నటికీ మరవలేమన్నారు. అలాగే సైదాపురం బస్టాండ్‌లో ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఓ ఆర్‌ఐ నారాయణ, వీఆర్వోలు రమాదేవి, హైమావతి, హజరత్తయ్య, సుబ్బయ్య పాల్గొన్నారు.

త్యాగమూర్తి పొట్టి శ్రీరాములు

నాయుడుపేటటౌన్: తెలుగు ప్రజల అభ్యున్నతి కోసం అవిరామంగా కృషి చేసి, ఆంధ్ర రాష్ట్ర ఆవతరణకు ప్రాణత్యాగం చేసిన మహనీయులు పొట్టిశ్రీరాములు సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోయాయని ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు, పారిశ్రామికవేత్త పెసల జయరాజగోపాల్ అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా గురువారం ఆ సంఘం నాయకులు పాత బస్టాండ్ వద్ద ఉన్న శ్రీపొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1952 ముందు అప్పట్లో మద్రాసు ప్రభుత్వం తెలుగు వారిపై చూపుతున్న వివక్షకు పొట్టి శ్రీరాములు చలించిపోయి, 58 రోజుల పాటు ఆమరణదీక్ష చేపట్టి అమరులు కావడంతో ఆయన త్యాగం ఫలితంగా తెలుగు రాష్ట్రం ఏర్పడిందన్నారు. పొట్టి శ్రీరాములు సేవలకు నిదర్శనంగా భారతరత్న బిరుదును ప్రదానం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు కోట వెంకటేశ్వర్లు, యాచ్చా లక్ష్మీనారాయణ, మునగాల కృష్ణారావు, దోర్నాదులు యతీంద్ర, దేవత గోపి, నిరంజన్, మెంటా రమణయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రీనివాసరావు అధ్యక్షతన చైర్ పర్సన్ కటకం దీపిక, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలో పలు ప్రభుత్వ కార్యాలయాల్లో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

అమరజీవి ఆదర్శం

కోట: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని గురువారం కోటలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బజారువీధిలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శమని వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు లక్ష్మయ్య, రత్నయ్య, ఓలేటి సత్యం, విష్ణు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



వెంకటగిరి: పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



వెంకటగిరి: మాట్లాడుతున్న నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ దొంతు శారద



పెళ్లకూరు: పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్లో పాల్గొన్న అధికారులు

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

నాయుడుపేట: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంపీపీ కురుగుండ ధనలక్ష్మి అధ్యక్షతన శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు చేసిన ఔనత్యాన్ని వివరించి గుర్తు చేసుకున్నారు. ఏఓ కుసుమ, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



సైదాపురం: నివాళులర్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది,



నాయుడుపేటటౌన్: నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు,



కోట: ఆర్యవైశ్య సంఘం నేతల నివాళి,



నాయుడుపేట: నివాళులర్పిస్తున్న ఎంపీపీ

దాతల సహకారంతో తీరిన దాహార్తి



ప్రసాదాలు పంపిణీ చేస్తున్న పాఠశాల సిబ్బంది

చిల్లకూరు: తూర్పుకనుపూరులో జరుగుతున్న ముత్యాలమ్మ జాతరకు గురువారం పోటెత్తిన భక్తుల దాహార్తిని తీర్చేందుకు భక్తులు ముందుకు వచ్చారు. ఈ క్రమంలోనే ఈదులవారిపాళెంలోని నవనీతం ఇంటర్ నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే కోటకు చెందిన 108 మధు, అంబలి పంపిణీ చేశారు. బాలచెన్నయ్యతోపాటుగా పలువురు దాతలు ముందుకు వచ్చి మజ్జిగ, మంచి నీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చింత విశ్వేశరరావు, శశిధర్, గోవింద్, ఎస్ సుబ్బారావు, సీఈఓ శ్రీహర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాపూరు: మండలంలోని కండలేరు జలాశయంలో ఉన్న డాక్టర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల ప్రిన్సిపల్ భారతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ బాలికల గురుకులంలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరదలిచిన విద్యార్థినులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐదో తరగతిలో 80 సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంఈసీలో 40 సీట్లు, సీఈసీలో 40 సీట్లు ఉన్నాయని తెలిపారు. అర్హులైన విద్యార్థినులు ఈ నెల 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



మజ్జిగప్యాకెట్లు పంపిణీ చేసున్న దాత

నాయుడుపేటటౌన్: ముత్యాలమ్మ జాతరకు వెళుతున్న ప్రయాణికులకు గురువారం పట్టణానికి చెందిన హేమంత్ అనే వ్యక్తి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పట్టణంలోని ఆర్టీసీ రూరల్ ప్రాంగణం వద్ద ఎండలో వెళుతున్న ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆర్టీసీ ఎస్ఎంయూ యూనియన్ నాయకులు పసల చంద్ర, రమణయ్య, ట్రావెల్స్ అధినేత సుబ్రహ్మణ్యం, ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఆర్ ఫార్ములాతో ఉత్తమ ఫలితాలు

నాయుడుపేట: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధనకు ట్రిపుల్ ఆర్ ఫార్ములా ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందని గూడూరు డిప్యూటీ డీఈఓ శివప్రసాద్ రెడ్డి అన్నారు. నాయుడుపేట ఎల్ఏసాగరం జెడ్పీబాలుర ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించిన ఆయన విద్యార్థులు ఉపాధ్యాయులతో కాసేపు మాట్లాడారు. విద్యార్థులు నిత్యం చదడవం రాయడం కాదని, ట్రిపుల్ ఆర్ ఫార్ములాను పాటిస్తే ఉత్తమ ఫలితాలు మన వెంటే ఉంటాయని చెప్పారు. రీడింగ్ రీమెమరైజింగ్ రీ ప్రొడ్యూసింగ్ సూత్రాలతో ముందుకు వెళ్లాలని, ఆ దిశగా విద్యార్థులకు సూచనలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు మనోజ్‌కుమార్, ఉపాధ్యాయులు గడదాసు వెంకటేశ్వర్లు, తదితరులువున్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ

పద్ధతి మార్చుకోండి

సైదాపురం: స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది ఇంకా తమ పద్ధతి మార్చుకోలేదని, ఇప్పటికైనా మార్చుకోవాలని విచారణాధికారి, జిల్లా ప్రోగ్రాం అధికారి పీఎల్ దయాకర్ అసహనం వ్యక్తం చేశారు. పీహెచ్‌సీలో సిబ్బంది పనితీరుపై గురువారం ఆయన విచారణ జరిపారు. ప్రధానంగా ఇక్కడ పనిచేసే సిబ్బంది రోగులతో వ్యవహరించే తీరు మార్చుకోవాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. సైదాపురం పీహెచ్‌సీని ప్రక్షాళన చేస్తామన్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలను అందించేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటుందన్నారు. సిబ్బంది కూడా తమ ప్రవర్తన మార్చుకోవాలని చెప్పారు. ఆయన వెంట వైద్యాధికారి శ్రావణి తదితరులున్నారు.



సిబ్బందిని ప్రశ్నిస్తున్న దయాకర్

సర్వే పక్కాగా ఉండాలి

దక్కిలి: గ్రామాల్లోని గర్భిణులు, బాలింతలు, 1–18 ఏళ్ల లోపు పిల్లలకు హిమోగ్లోబిన్(హెచ్‌బీ) పరీక్షలు చేసి, రక్తహీనత ఉన్న వారిని గుర్తించేందుకు చేపట్టిన సర్వేని పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో గురువారం ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో చేస్తున్న సర్వేలో రక్తహీనత తక్కువగా ఉన్న గర్భిణులు, బాలింతలు, పిల్లలు వివరాలను వెంటనే వైద్యాధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు. ఇప్పటి వరకు చేసిన సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఇంకా చేపట్టాల్సిన సర్వేను గ్రామ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో కలిసి త్వరతగతిని పూర్తి చేయాలని ఆదేశించారు. ఫీవర్ సర్వే చేపట్టాలని, సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యాధికారి బిందు ప్రియాంక, ఎంఈఓ వెంకటేశ్వర్లు, పీహెచ్ఎన్ జత్రుత, సూపర్‌వైజర్లు ఆదిలక్ష్మి, లీలమ్మ తదితరులు పాల్గొన్నారు.



దక్కిలి: మాట్లాడుతున్న ఎంపీడీఓ కోటేశ్వరరావు

రైతు సంక్షేమమే లక్ష్యం

సైదాపురం: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు అన్నారు. సైదాపురం రైతు భరోసా కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ–క్రాప్ నమోదుపై అధికారులతో చర్చించారు. అనంతరం ఈ–క్రాప్ నమోదు చేసిన రైతుల వివరాలకు సంబంధించి నోటీసు బోర్డులో ఉన్న పేర్లు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ–క్రాప్ నమోదుతో రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. తద్వారా ప్రభుత్వం నుంచి పలు రకాల లబ్ధి చేకూరుతుందన్నారు. జిల్లాలో రబీ సాగులో సుమారు 3.60 లక్షల ఎకరాల్లో ఈ–క్రాప్ కింద పంటను నమోదు చేశామన్నారు. నూరుశాతం లక్ష్యాన్ని పూర్తి చేశామని, ఈకైవైసీ 95 శాతం నమోదు చేశామన్నారు. ఆయన వెంట ఏఓ హైమావతి, సహాయకురాలు పుష్పలత ఉన్నారు.



జాబితాను పరిశీలిస్తున్న సుధాకర్‌రాజు

ఎన్‌బీకేఆర్‌లో సాంకేతిక సదస్సు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో గురువారం సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో టెక్‌వ్యూహ–2023 సాంకేతిక సదస్సు జరిగింది. ఈ సదస్సును కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి ప్రారంభించారు. పలు ఇంజినీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులు హాజరై తమ ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఉత్తమ ప్రాజెక్ట్‌లకు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక సదస్సుల్లో పాల్గొంటే ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకోవచ్చన్నారు. సీఎస్ఈ విభాగం హెచ్ఓడీ రాజశేఖర్, ప్రోగ్రాం కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



సాంకేతిక సదస్సు ప్రారంభిస్తున్న కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి

గ్రామోత్సవం.. కోలాహలం





పోలేరమ్మను దర్శించుకుని వస్తున్న ఎమ్మెల్సీ కళ్యాణ్ చక్రవర్తి దంపతులు, నాయకులు, యారా గురునాథస్వామి గ్రామోత్సవం

చిల్లకూరు: ముత్యాలమ్మ జాతరలో భాగంగా గురువారం గ్రామోత్సవం కోలాహలంగా సాగింది. లక్షలాది మంది భక్తులు తూర్పుకనుపూరుకు తరలిరావడంతో ఎటు చూసినా జనం కనిపించారు. రెండు రోజులుగా జనం వస్తున్నప్పటికీ గురువారం సాయంత్రం ఒకసారిగా భక్తుల రద్దీ పెరిగింది. పోలేరమ్మ గుడిలో అమ్మవారి దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. దీంతో అమ్మవారి దర్శనానికి గంటకుపైగా సమయం పట్టింది. దీంతో చిన్న పిల్లలు వృద్ధులు కొంత ఇబ్బంది పడినప్పటికీ దాతల సహకారంతో మజ్జిగ, మంచి నీటి ప్యాకెట్లను అందించడంతో భక్తులు సేద దీరారు. అలాగే యారా గురునాథస్వామి గ్రామోత్సవంలో గొల్లల వేసి వీరతాళ్లు అలరించాయి. ఉత్సవంలో ముందు నడుస్తున్న గణాచారి వద్ద దారం తీసుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. అమ్మవారి జాతర చివరి ఘట్టంలోకి వస్తుండడంతో భక్తులు ఆలయం వద్దనే తాత్కాలికంగా పట్టలు క ట్టుకుని, రాత్రి జాగారం చేసేందుకు సిద్ధపడ్డారు.



సేద దీరుతున్న భక్తులు

అమ్మవార్లను దర్శించుకున్న ప్రముఖులు

తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో జరిగే జాతరలో భాగంగా మూడో రోజైన గురువారం అమ్మవార్లను ప్రముఖులు దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి దంపతులు ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, అమ్మవారి ఆశీర్వచనాలు అందజేశారు. అలాగే పేరమ్మను కూడా దర్శించుకున్నారు. అనంతరం గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్, నెల్లూరు జిల్లా ఎస్పీ విజయారావు అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఈ ఏడాది జాతరను పూర్తిగా అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. జాతర నిర్వహణలో పని చేసిన ప్రతి శాఖాధికారి నిబద్ధతతో పని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కళ్యాణ్ చక్రవర్తితో జెడ్పీటీసీ సభ్యులు మన్నెం శీనయ్య, ఎంపీపీ వెంకటరమణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పక్కాగా రీ సర్వే



సర్వే చేస్తున్న సిబ్బంది

సైదాపురం: మండలంలో వైఎస్సార్ శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంగా భాగంగా డ్రోన్ల సహాయంగా పక్కాగా రీసర్వే చేస్తున్నట్లు మండల సర్వేయర్ హజరత్తయ్య తెలిపారు. మండలంలోని పాలూరు గ్రామంలో గురువారం డ్రోన్ల సర్వే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సర్వే కారణంగా ఎలాంటి వివాదాలు చోటు లేకుండా ఉంటుందన్నారు. సుమారు 5 కిలో మీటర్ల వరకు ఈ డ్రోన్ పనిచేస్తుందన్నారు.

అత్యున్నత శిఖరాలకు చేరాలి

నాయుడుపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యున్నత శిఖరాలకు చేరుకోవాలని పారిశ్రామిక వేత్త పెసల జయరాజగోపాల్ అన్నారు. నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన ఫ్రెషర్స్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఏటా డిగ్రీలో చేరిన ప్రతి విద్యార్థికీ యూనిఫామ్ దుస్తులను అందించేందుకు తాము ముందుంటామన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యమన్నారు. విద్యార్థులకు ఎలాంటి అవసరాలను తీర్చేందుకు తెలియపరచాలన్నారు. లక్ష్యంతో విద్యార్థులు చదువుకోవాలని, అప్పుడే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని తెలిపారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ చదువులపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మధుసూదన్‌రావు, రామయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యూనిఫామ్ అందజేస్తున్న పారిశ్రామిక వేత్త పెసల జయరాజగోపాల్

కండలేరును సందర్శించిన చెన్నై బృందం



కండలేరు అతిథి గృహంలో అధికారులతో సమీక్షిస్తున్న చెన్నై మెట్రో వాటర్ బృందం సభ్యులు

రాపూరు: చెన్నై మెట్రో బృందం సభ్యులు గురువారం తిరుపతి జిల్లాలోని కండలేరు జలాశయాన్ని సందర్శించారు. కండలేరు నుంచి వివిధ ప్రాంతాలకు వెళుతున్న కాలువలు, హెడ్‌రెగ్యులేటర్‌ను సందర్శించి, జలాశయ అధికారులతో సమీక్షించారు. జలాశం నుంచి చెన్నైకు ఇప్పటివరకు విడుదల చేసిన జలాల వివరాలు, అందించాల్సిన నీటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. చెన్నై మెట్రో వాటర్ సీఈ జయకర్ జేస్ దాస్, ఎస్ఈలు ముత్తయ్య, సుగంతి, ఈఈ కాశీ, కండలేరు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి, డీఈలు సుధాకర్, ఓబుల్‌దాస్, లాల్‌జాన్సన్ పాల్గొన్నారు.